సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

అందరికీ ఆరోగ్యం.. అదే లక్ష్యం

- 'తూర్పు'లో జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే
- ఇంటింటికీ వెళ్లి.. వైద్య సేవలందిస్తున్న సిబ్బంది
- యూపీహెచ్‌సీల్లో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు



10వ వార్డులో ఇళ్ల వద్ద ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



బాలాజీనగర్‌లో ఇంటి వద్ద మహిళకు బీపీ చెక్ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆరిలోవ: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో తూర్పు నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, సేవలు జోరుగా కొనసాగుతున్నాయి. సెప్టెంబర్ 19 నుంచి నియోజకవర్గంలో ఎఫ్ఆర్‌యాలు, యూపీహెచ్‌సీల పరిధిలో ఈ సేవలు అందిస్తున్నారు. స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, మహిళలు, యువకులందరికీ బీపీ, మధుమేహం, రక్త పరీక్షలు చేస్తున్నారు. అనంతరం అనారోగ్య సమస్యలు ఉన్న వారికి ప్రత్యేకంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఆ క్యాంపుల్లో అన్ని రకాల పరీక్షలు చేస్తారు. బీపీ, సుగర్‌తో పాటు కంటి వైద్య పరీక్షలు, వివిధ రకాల రక్త పరీక్షలు, యూరిన్, గైనిక్, డెంగ్యూ, కఫం తదితర టెస్ట్‌లు నిర్వహించనున్నారు. వైద్య శిబిరాల్లో జనరల్, గైనిక్, పిల్లలు, కంటి సంబంధిత వైద్యులు అందుబాటులో ఉంటారు. నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ జోన్–2, 3ల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించే తేదీలను ఆయా జోన్‌ల వైద్యాధికారులు ఇప్పటికే ప్రకటించారు. జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ఇవి జరగనున్నాయి.

వైద్య శిబిరాలు ఎప్పుడు, ఎక్కడ..

జీవీఎంసీ జోన్ 2, 3ల పరిధుల్లో ఈ నెల 3 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రారంభం కానున్నాయి. జోన్–2 పరిధిలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీ) నాలుగు ఉన్నాయి.

- ఈ నెల 7న 11వ వార్డు బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు.
- ఈ నెల 9న 13వ వార్డు ఆరిలోవ కాలనీ(తోటగరువు) యూపీహెచ్‌సీ పరిధిలో శిబిరం జరగనుంది.
- ఈ నెల 13న వివేకానందనగర్(ఎంఎస్ఆర్ లేఅవుట్) పరిధిలో శిబిరం జరుగనుంది.
- ఈ నెల 20న 13వ వార్డు శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు.

జోన్–3లో..

- ఈ నెల 3న 16వ వార్డు ఇసుకతోట యూపీహెచ్‌సీలో వైద్య శిబిరం జరుగుతుంది.
- ఈ నెల 12న 15, 16 వార్డుల పరిధి మద్దిలపాలెం యూపీహెచ్‌సీలో శిబిరం జరగనుంది.
- ఈ నెల 13న 19వ వార్డు లాసెన్స్‌బే కాలనీ యూపీహెచ్‌సీలో శిబిరం నిర్వహించనున్నారు.
- ఈ నెల 16న 20వ వార్డు చినవాల్తేరు యూపీహెచ్‌సీలో శిబిరం జరగనుంది.
- ఈ నెల 21న 28వ వార్డు భాగమైన దొండపర్తి యూపీహెచ్‌సీ పరిధిలో శిబిరం జరుగుతుంది.

ఏర్పాట్లు చేస్తున్నాం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. తూర్పు నియోజకవర్గంలోని జోన్–3 పరిధి యూపీహెచ్‌సీల్లో ఈ నెల 3 నుంచి, జోన్–2 పరిధి యూపీహెచ్‌ల్లో ఈ నెల 7 నుంచి శిబిరాలు జరగనున్నాయి. కంటి వైద్యులు, గైనిక్, పిల్లల వైద్యులు, జనరల్ విభాగం వైద్యులతోపాటు స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలందిస్తారు. ఆయా జోన్ల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కనకమహలక్ష్మి, జోన్–2 కమిషనర్, జీవీఎంసీ

కైలాసగిరి కూడలి ఆధునికీకరణ



శంకుస్థాపన పూజలు చేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు కైలాసగిరి కూడలి అభివృద్ధికి శనివారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కైలాసగిరికి వెళ్లే ఈ కూడలిని ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. దీని కోసం రూ.76 లక్షలు జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వీటిని వేగవంతంగా పూర్తి చేయించాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఎంపీ ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్వాతి, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, భీమారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు పరిధి సంతపాలెంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ఎంత మంది లబ్ధి పొందారో అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీవీ స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన సమస్యల పరిష్కారానికి సచివాలయాల సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లపల్లి రాజబాబు, కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కార శేఖర్, జి.విక్టర్, ఈగల బుజ్జి, జ్యోతి ప్రకాష్, మోహన్, శ్రీను, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇడియోపతిక్ కంటి వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవా

ఆరిలోవ: ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవా అన్నారు. శనివారం ఆస్పత్రి సమావేశం మందిరంలో కంటి సమస్యలు ఉన్న వారికి ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. నరాల సంబంధమైన ఈ వ్యాధి రెండు కళ్లను, మెదడును ప్రభావితం చేస్తుందన్నారు. సాధారణంగా 20 నుంచి 50 ఏళ్ల వయసు గల మహిళలు, ఊబకాయం ఉన్నవారిలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువ మందిలో పెరుగుతోందన్నారు. తీవ్రమైన తలనొప్పి రావడం దీని లక్షణమన్నారు. అశ్రద్ధ చేస్తే దృష్టి లోపానికి దారితీస్తుందని, దీర్ఘకాలంగా తలనొప్పితో బాధపడేవారు వెంటనే కంటి వైద్యులను సంప్రదించాలని డాక్టర్ వీరేంద్ర సూచించారు. కార్యక్రమంలో ఎల్వీపీ కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

4న వివిధ దేవాలయాల సందర్శన

మద్దిలపాలెం: బాల వికాస్ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 4న నగరంలోని వివిధ మతాల దేవాలయాలను సందర్శించనున్నామని ఐఏఆర్ఎఫ్ చైర్మన్ నరవ ప్రకాశరావు తెలిపారు. అంతర్జాతీయ అహింసా దినోత్సవం, గాంధీ జయంతిని పురస్కరించుకుని మత సమైక్యత గురించి గురుద్వారా, చర్చిలు, జైనుల గుడి, దేవాల యాలను సందర్శిస్తామన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు ఆచార్య వి.బాల మోహన్‌దాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

బోధనలో నూతన పోకడలతో చక్కటి ఫలితాలు



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ అజిత్ థెటె

ఎంవీపీకాలనీ: బోధన లో నూతన పోకడలు అందిపుచ్చుకుంటే చక్కని ఫలితాలు వస్తాయని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ లీడర్‌షిప్ ఇన్ ఎడ్యుకేషన్ (పూణే) డైరెక్టర్ ఆచార్య అజిత్ ఆర్ థెటె అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆచార్య అజిత్ ఆర్ థెటె బోధనల్లో వస్తున్న మార్పులను అధ్యాపకులకు వివరించారు. విద్యా విధానంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అత్యంత ప్రాధానమైన అంశమన్నారు. ఈ దిశగా అధ్యాపకులు సుశిక్షితులు కావాలన్నారు. కార్యక్రమంలో ఐఐఏఎం కార్యదర్శి సుంకరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొక్కలు నాటిన విద్యార్థులు



విద్యార్థుల చేత మొక్కలు నాటిస్తున్న పరిషత్ సభ్యులు

బీచ్‌రోడ్డు : పెదవాల్తేరులోని కేడీపీఎం స్కూల్లో శనివారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే స్కూల్ ఆవరణలో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ నార్త్ అధ్యక్షుడు సోమయాజులు, రవికుమార్, స్కూల్ హెచ్‌ఎం సుమతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆరోగ్య సురక్ష సర్వే



ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

బీచ్‌రోడ్డు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉత్సాహంగా కొనసాగుతోంది. శనివారం జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలోని సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు షుగర్, బీపీ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాన్ని పోలీసు హౌసింగ్ బోర్డు డైరెక్టర్ పీతల గోవింద్ పర్యవేక్షించారు. ప్రజల వద్దకే వైద్యం అనే సరికొత్త ఆలోచనకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారని ప్రజలకు ఆయన వివరించారు.

ఖైదీ మృతిపై 7న మెజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట: సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్న పాలాసి వెంకటరావు మృతిపై ఈనెల 7న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేస్తున్నట్టు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సైన్ సాహెబ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం బొంజంగి గ్రామం కించూరు పంచాయతీకి చెందిన పాలాసి వెంకటరావు ఒక కేసులో సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్నారు. సెప్టెంబర్ 14న అనారోగ్యానికి గురి కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. 15వ తేదీన చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆర్‌డీవో తెలిపారు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి మెజిస్టీరియల్ విచారణ చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున నిర్ణయించారు. ఈ విచారణ కోసం విశాఖ ఆర్‌డీవోను విచారణ అధికారిగా నియమించారు. విశాఖ ఆర్‌డీవో కార్యాలయంలో 7తేదీన విచారణ చేస్తున్నామని, వెంకటరావు కోసం తెలిసిన వారు ఎవరైనా విచారణకు హాజరై, లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు.

అతి పే..ద్ద అరటి గెల



ఎంవీపీ రైతుబజార్‌లో 300 పండ్లతో అరటి గెల

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌కు శనివారం 300 పండ్లతో పెద్ద అరటి గెలను ఓ రైతు తీసుకొచ్చాడు. కోటవురట్ల మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన శ్రీను అనే రైతు ఇక్కడ బజార్‌కు తీసుకొచ్చిన సుమారు మూడున్నర అడుగులకు పైగా పొడవున్న ఈ అరటి గెలకు 16 పెడలు ఉన్నాయి. దానికి సుమారు 300 అరటి పండ్లు ఉన్నాయి. సాధారణంగా అరటి గెలకు 7 నుంచి 10 వరకు పెడలు, 150 నుంచి 180 వరకు పండ్లు ఉంటాయి. సపోటా ముకిరీ అనే పిలిచే ఈ గెలకు మాత్రం 16 పెడలున్నాయి.

ఏయూ లుక్స్ డిజిటల్ స్టూడియో ప్రారంభం



స్టూడియో ప్రారంభోత్సవంలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, డాక్టర్ అజిత్‌కుమార్, ఆచార్యులు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం అందుబాటులోకి తెచ్చిన ఏయూ లుక్స్ డిజిటల్ స్టూడియో సేవలు శనివారం మొదలయ్యాయి. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కలిసి వీడీఎం ఇండియా ఇన్ ది మూవ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అజిత్‌కుమార్ స్టూడియోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పోకడలను అందిపుచ్చుకుంటూ ఆంధ్రా యూనివర్సిటీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. వర్సిటీ ఏయూ లుక్స్ వారపత్రికతోపాటు డిజిటల్ ఛానల్‌ను అందుబాటులోకి తేవడాన్ని అభినందించారు. వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఏయూ సమాచారంతోపాటు వర్సిటీని సందర్శించిన ప్రముఖుల అభిప్రాయాలను వీడియో, ఆడియోల ద్వారా ఎప్పటికప్పుడు డిజిటల్ ఛానల్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య సమత, ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఆచార్య శ్రీనివాసరావు, ఆచార్య శశిభూషణ్‌రావు, ఆచార్య నరసింహారావు, ఆచార్య రాజేంద్రప్రసాద్, ఆచార్య శోభశ్రీ, ఆచార్య విజయలక్ష్మి, ఆచార్య భట్టి తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.28 లక్షలు



హుండీ లెక్కిస్తున్న శివజ్యోతి, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో దేవదాయ శాఖ తనిఖీదారు బి.వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో హుండీని శనివారం లెక్కించగా 14 రోజులకు రూ.16.28 లక్షలు వచ్చాయి. బంగారం నాలుగు గ్రాముల 513 మిల్లీ గ్రాములు, వెండి 172 గ్రాముల 700 మిల్లీ గ్రాములు, ఇతర దేశాల డాలర్లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.చోళన్ తెలిపారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాలయ సిబ్బంది జి.గోవింద రెడ్డి, డి.ఎస్. ప్రసాద్, ఈ. అప్పలరాజు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మెగా ఉచిత వైద్య శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సొసైటీ సభ్యులు

బీచ్‌రోడ్డు: మహిళల కోసం సోమవారం భారీ స్థాయిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ అధ్యక్షుడు వైసీహెచ్ దొరబాబు తెలిపారు. శనివారం నగరంలోని ఒక హోటల్లో వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీ ఆశ్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్ నందు ఉదయం 9 గంటలకు ఈ వైద్య శిబిరం ప్రారంభం కానుందన్నారు. ప్రసూతి, కిడ్నీ, గుండె, దంత, ఊపిరితిత్తులు, క్యాన్సర్, న్యూరాలజీ, చర్మవ్యాధులు వంటి సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు శేఖర్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కాలేజీలో స్వచ్ఛతాహి సేవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కృష్ణా డిగ్రీ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

మద్దిలపాలెం: స్వచ్ఛతాహి సేవ మనందరి బాధ్యతను గుర్తుచేసుకునే అద్భుతమైన కార్యక్రమమని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు అన్నారు. శనివారం కళాశాలలో స్వచ్ఛతాహి సేవపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇల్లు, మన కుటుంబ పరిశుభ్రత కోసం పాడుపడాలన్నారు. ప్రతి అడుగు పరిశుభ్రత వైపు నడవాలని పిలుపునిచ్చారు. 15 రోజులుగా పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ వార్డుల్లో శ్రమదాన కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛతాహి సేవపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు పోలా ఉమామహేశ్వరరావు, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, శ్యామ్యూల్ డేవిడ్ రాజ్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్, రెడ్ రిబ్బన్ క్లబ్‌ల బృందాలు పాల్గొన్నాయి.

మరిన్ని కుంభకోణాల్లో బాబుకు శిక్ష తప్పదు



మాట్లాడుతున్న కమిటీ సభ్యుడు మంగరాజు

డాబాగార్డెన్స్: నేను నిప్పు.. నేను ఉప్పు అన్న చంద్రబాబునాయుడు నేడు రాజమండ్రి సెంట్రల్ జైల్లో తుప్పయ్యారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. డాబాగార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు దొంగల ముఠా నాయకుడని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ.371 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఔటర్‌రింగ్ రోడ్డు, ఫైబర్‌గ్రిడ్, అమరావతి భూముల వ్యవహారాల్లోనూ, పోలవరం ప్రాజెక్టు సబ్‌కాంట్రాక్ట్ వ్యవహారంలోనూ ఇంకా శిక్ష పడాల్సి ఉందని చెప్పారు. 14 ఏళ్ల కాలంలో సుమారు రూ.2 లక్షల కోట్ల పైచిలుకు సంపాదించారని తెలిపారు. టీడీపీ శ్రేణులు సానుభూతికి దీక్షలు చేస్తున్నారని, కానీ ప్రజల్లో స్పందన లేదన్నారు. తప్పు చేయకపోతే బెయిల్ తెచ్చుకోవచ్చు కదా? అని ప్రశ్నించారు. స్టేలు తెచ్చుకోకపోతే ఇప్పటికే జైలు జీవితం గడిపేవారన్నారు. లోకేష్‌కు సీఐడీ అధికారులు నోటీసులు ఇచ్చారని, ఎంత గొప్ప వారైనా చట్టం ముందు సమానమేనన్నారు. లోకేష్ కూడా తప్పు చేశాడని చెప్పడానికి ముందస్తు బెయిల్ పిటిషనే నిదర్శనమన్నారు. చంద్రబాబు కేసులో అన్ని ఆధారాలు చూసి, జడ్జి తీర్పు ఇస్తే సోషల్ మీడియాలో జడ్జిపై అసభ్యంగా ట్రోల్ చేయడాన్ని మంగరాజు తీవ్రంగా ఖండించారు. ట్రోల్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దసరా నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన సాగిస్తానని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రకటనపై మాల మహానాడు స్వాగతిస్తుందన్నారు. విజయవాడలో యావత్ దేశం హర్షించేటట్టుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని సుమారు రూ.400 కోట్లకు పైగా వెచ్చించి నిర్మించడం అభినందనీయమన్నారు. ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా 2024 ఎన్నికల్లో 175 సీట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుచుకోవడం ఖాయమన్నారు. టి.శివ, డి. కోటేశ్వరరావు, పి. రామారావు, జి. వెంకటేశ్వరరావు, సందీప్, సునీల్‌బాబు, రోహిత్ పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల నిరసన

ఎంవీపీకాలనీ: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా తూర్పు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు శనివారం సంఘీభావం తెలిపాయి. నారా బ్రాహ్మణి పిలుపు మేరకు ఉషోదయ కూడలిలో 'మోత మోగిద్దాం'పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈలలు వేసి, బాజాలు మోగించి, నినాదాలు చేస్తు నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్, బైరెడ్డి పోతన్నరెడ్డి, జీవీ రామచంద్రరావు, నెక్కంటి సత్తిబాబు, అమరేంద్ర, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా అన్నసంతర్పణలు



పెదగదిలిలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి



ఎన్ఎంఆర్ కాలనీలో అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ సునీత



సింహాద్రిపురంలో అన్నదానం చేస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ శ్రీవిద్య, గిరిబాబు

ఆరిలోవ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆరిలోవ పరిధి పెదగదిలి, లీలాసుందరయ్య నగర్, దుర్గాబజార్, సంతపాలెం, ఆదర్శ నగర్ తదితర ప్రాంతాల్లో కమిటీల ఆధ్వర్యంలో అన్నసంతర్పణలు నిర్వహించారు. పెదగదిలి మేయర్ క్యాంప్ కార్యాలయం ఆవరణలో శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అన్నసమారాధనలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ క్లస్టర్–1(10,11,12,13 వార్డులు) అధ్యక్షుడు గొలగాని శ్రీనివాస్‌తో కలసి పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. పెదగదిలి, చినగదిలి, సింహగిరి కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ, తోటగరువు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దూలి రఘు, సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

13వ వార్డులో..

జీవీఎంసీ 13వ వార్డులోని శివాజీనగర్, ఎన్ఎంఆర్ కాలనీల్లో జరిగిన అన్నసమారాధనల్లో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ కెల్ల సునీత పాల్గొని భక్తులకు స్వామి ప్రసాదం వడ్డించారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

15వ వార్డులో..

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానాన్ని ముఖ్య అతిథి విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, వార్డు ఇన్‌చార్జి గిరిబాబు, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావులతో కలిసి ఆయన భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, సురేష్, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అన్నప్రసాదం వడ్డిస్తున్న అక్కరమాని వెంకటరావు

గణపతి సన్నిధిలో అన్నసమారాధన

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరు నేతాజీ వీధిలో అన్నసమారాధన నిర్వహించారు. ఎస్‌వీసీసీ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

ఆల్ ది బెస్ట్ అథ్లెట్ జ్యోతి



విశాఖ స్పోర్ట్స్: ఆసియన్ గేమ్స్‌లో విశాఖ అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ తొలి హీట్‌ను 13.03 సెకన్లలో పూర్తి చేసి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 24వ స్థానంలో ఉన్న జ్యోతి తొలిరౌండ్ హీట్‌లో 297 బిబ్‌తో 6వ లేన్‌లో పరుగెత్తింది. ఇదే హీట్‌లో పాల్గొన్న చైనాకు చెందిన లిన్ వై 12.79 సెకన్లలో వంద మీటర్ల హార్డిల్స్‌ను పూర్తి చేసి పెర్సనల్ బెస్ట్‌తో తొలి స్థానంలో నిలిచింది. అయితే ఆసియన్ గేమ్స్‌లో వుమెన్ 100 మీటర్ల హార్డిల్స్ 12.63 సెకన్లతో పూర్తి చేసిన రికార్డు షిషిగ్నా(1998) పేరిట ఉంది. కాగా.. జ్యోతి ఆసియన్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల హార్డిల్స్‌ను 13.09 సెకన్లలోనే పూర్తి చేయగా.. బుడాపెస్ట్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ హీట్‌లో 13.05 సెకన్లలోనే పూర్తి చేసింది. ఆసియన్ గేమ్స్ హీట్‌లో 0.02 సెకన్లు మెరుగుపడింది. వుమెన్ 200 మీటర్ల పరుగులోనూ జ్యోతి పోటీ పడనుండగా ఆదివారం ఉదయం ఈ పోటీ జరగనుంది. ఆసియాలోని మేటి 8 మంది వుమెన్ హార్డిలర్స్ ఆదివారం రాత్రి 9.15 గంటలకు జరిగే ఫైనల్స్‌లో వుమెన్ ఫాస్టెస్ట్ హార్డిలర్‌గా నిలిచేందుకు పోటీపడనున్నారు. వరల్డ్ ర్యాంకింగ్‌లో ముందున్న జ్యోతి భారత పతాకను క్రీడా వినువీధిలో రెపరెపలాడించాలని ఆకాంక్షిద్దాం. ఆల్ ది బెస్ట్ జ్యోతి.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9912220751, 9010055116
Office mail : sakshiadvtvsp@gmail.com